క్లుప్తంగా

పరామర్శ



మేయర్ సురేష్ బాబుతో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, కడప మేయర్ కె. సురేష్ బాబు అన్న కుమారుడు ఆనంద్‌బాబు ఆదివారం మృతి చెందిన నేపథ్యంలో సోమవారం కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గుండె పోటు రావడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ సురేష్ బాబు కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానులు రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో సోమవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా జేబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవా సమితి వ్యవస్థాపకులు అశోక్ మాట్లాడుతూ తమ అభిమాన నటుడి జన్మదినాన పేదలను ఆదుకునేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు రవితేజ, శివ, శరత్, అమర్, విశాల్, మహమ్మద్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శ్రీను, జైప్రకాశ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఉపాధ్యాయులపై వేధింపులను ఆపాలి

కడప ఎడ్యుకేషన్/ కడప వైఎస్ఆర్ సర్కిల్ : వర్క్ షాప్ పేరుతో ప్రైవేట్ ఉపాధ్యాయులను వేధిస్తున్న చైతన్య, నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్జేడీ రాఘవరెడ్డికి డీవైఎఫ్ఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు.

ఆర్జేడీకి వినతి

కార్పొరేట్ విద్యాసంస్థలైన నారాయణ, చైతన్య యాజమాన్య పాఠశాలలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వకుండా వర్కుషాపు పేరిట వేధిస్తున్నారని, సంబంధిత పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ప్రైవేటు టీచర్స్ అండ్ లెక్చరర్స్ యూనియన్(పీఏల్‌టియూ) రాష్ట్ర అధ్యక్షుడు గడ్డంరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం పాఠశాల విద్య ఆర్జేడీ రాఘవరెడ్డిని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు.

ఆర్ఐఓకు వినతి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ తరగతులు నిర్వహిస్తున్నాయని, అలాంటి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత్ విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం ఇంటర్ ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్యను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.

తడి, పొడి చెత్త వివరాలు నమోదు చేయాలి

కడప కార్పొరేషన్: ప్రతిరోజూ సేకరిస్తున్న తడి, పొడి చెత్త వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. సోమవారం పుట్లంపల్లి, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఉక్కాయపల్లె, వినాయక నగర్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను ఆయన పరిశీలించారు. పుట్లంపల్లి జీటీఎస్ వద్ద వేసిన కంపోస్టును శుభ్రం చేయించాలని, ఆరు టన్నులకు తగ్గకుండా తడి, పొడి చెత్తను సేకరించాలన్నారు. కంపోస్టింగ్ పిట్స్ వద్ద పైపులైన్ ఏర్పాటు చేయాలని, ప్రతి డివిజన్ నుంచి మొదటి ట్రిప్పు 750 కేజీలకు తగ్గకుండా తడి చెత్త సేకరించాలన్నారు. టెంకాయల వివరాలను పరిశీలించి బరువు వేయించాలన్నారు. కంపాక్టర్ బిన్స్‌ను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించాలన్నారు. ఉక్కాయపల్లెలో గంబుషియా ఫిష్ ట్యాంక్ లను పరిశీలించి ట్యాంకుల అడుగు భాగమున మట్టిని ఏర్పాటు చేసి లోటస్ మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.

నేడు గంధోత్సవం

జమ్మలమడుగు: ఆస్తానే గౌసియా దర్గా ఉరుసు మహోత్సవాన్ని పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరా ఖాద్రీ ప్రారంభించారు. మంగళవారం సాయంత్రం సయ్యద్‌షా బడేగౌస్‌పీరా ఖాద్రీ 92వ ఉరుసు మహోత్సవం సందర్భంగా గంధోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పక్కీర్ల మేళాలతో పురవీధుల గుండా గంధాన్ని ఊరేగింపుగా తీసుకుని వచ్చి దర్గాలో స్వామి వారికి సమర్పిస్తారు.

తెప్పోత్సవాలకు వేళాయె..

- నేటి నుంచి కడప రాయుడి తెప్పోత్సవాలు
- పూర్తయిన ఏర్పాట్లు

కడప కల్చరల్ : కడప రాయుడు శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక తెప్పోత్సవాలు మంగళవారం నుంచి మూడు రోజులపాటు జరగనున్నాయి. జిల్లాలో అత్యంత పురాతనమైన ఆలయాలలో కడప రాయుని ఆలయం ఒకటి. చారిత్రకంగా, ఆధ్యాత్మికంగా ఈ క్షేత్రానికి ఎంతో పేరుంది. జనవరి చివరిన బ్రహ్మోత్సవాలు, మే మాసంలో తెప్పోత్సవాలు జరుగుతాయి. మంగళ, బుధ, గురు వారాలలో జరగనున్న తెప్పోత్సవం కోసం ఇప్పటికే తిరుపతి నుంచి ప్రత్యేకంగా తెప్పను తెప్పించి ఉంచారు. పుష్కరిణిలోని నీటిని మూడు రోజుల క్రితం పూర్తిగా తొలగించారు. ప్లాట్‌ఫామ్‌కు సమంగా ఉండేలా బోర్ల నుంచి నీటిని నింపుతున్నారు. ఆలయంలో కూడా పూర్తిగా రంగురంగుల చలువ పందిళ్లు వేసి భక్తులకు వేసవి బాధలు లేకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకున్నారు.

కోనేటి చరిత్ర..

కడప రాయుని కోనేటి (పుష్కరిణి)కి చరిత్ర ఉంది. జిల్లాలోని పలు దేవాలయాల వద్ద కోనేర్లను మనం గమనించవచ్చు. అందులో ఈ పుష్కరిణికి విశిష్టమైన చరిత్ర ఉంది. చూడటానికి, వ్యవహారంలోనూ ఈ పుష్కరిణి కేవలం శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయానికి చెందినదేనని భావిస్తారు. కానీ ఆలయం ఎదురుగా అత్యంత సమీపంలో ఉన్న శ్రీ సోమేశ్వరస్వామి గుడికి ఈ పుష్కరిణి ఆనుకుని ఉండడం విశేషం. దీంతో ఈ పుష్కరిణి దేవునికడప శివాలయానికి కూడా చెందినదని కొందరు పెద్దలు తెలుపుతున్నారు.



దేవుని కడప పుష్కరిణి

– జిల్లాలో పెద్దదైన కడప రాయుని పుష్కరిణిని విజయనగర సామ్రాజ్య పాలకులు, సంఘమ వంశీయులు, ప్రౌఢ దేవరాయులు 1442లో దుందుభి నామ సంవత్సరం భాద్రపద శుద్ధ ఏకాదశి నాడు పుష్కరిణి తవ్వకం పనులను ప్రారంభించినట్లు శాసనాధారాలు ఉన్నాయి. పలువురు వాస్తు పండితులు నిర్మాణ రంగంలో నిపుణులైన వారితో చర్చించి ఈ కోనేరును నిర్మించారని తెలుస్తోంది. ఈ వివరాలన్నీ ఆలయ రంగమండపంలో మొన్నటివరకు శిలా శాసనంలో ఉండేవని కడప కైఫీయత్తుల ద్వారా తెలుస్తోంది. 1810–15 ప్రాంతంలో కల్నల్ మెకంజీ వద్ద రెవెన్యూశాఖలో పనిచేసిన ఉద్యోగి నారాయణరావు జిల్లాలోని శాసనాలు, వాటి వివరాలను గ్రంథంగా ప్రచురించారని కైఫీయత్తులలో పొందుపరిచారు. దేవుని కడప ఆలయ రంగమండపంలో పుష్కరిణి నిర్మాణ వివరాలను తెలిపే శిలా శాసనం ఉండేదని, నారాయణరావు పరిశీలించినప్పటికే అది పగుళ్ల బారి ఉండిందని తెలుస్తోంది. ఈ వివరాల ప్రకారం దేవునికడప ఆలయ పుష్కరిణి అత్యంత పురాతనమైనదిగా చెప్పవచ్చు.

ఉత్సవాల వివరాలు ..

మంగళవారం రాత్రి 7.00 గంటల నుంచి శ్రీ గోదాదేవి సమేత శ్రీకృష్ణుడు పుష్కరిణిలో మూడు మార్లు విహరించనున్నారు. బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఐదుమార్లు, గురువారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఏడుసార్లు పుష్కరిణిలో తెప్పపై విహరించనున్నారు.

ఊరేగింపు, ర్యాలీలకు అనుమతి లేదు

– కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్



కడప అర్బన్: కడప అసెంబ్లీ నియోజక వర్గం పరిధిలో ఎలాంటి ఊరేగింపులు, ర్యాలీలకు అనుమతి లేదని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ హెచ్చరించారు. సోమవారం ఈ మేరకు డీఎస్పీ పత్రికా ప్రకటన విడుదల చేశారు. జూన్ 6 అనంతరం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ముగిసిన తరువాత పరిశీలించి ర్యాలీలకు, ఊరేగింపులకు అనుమతి ఇస్తామన్నారు. 144 సెక్షన్ అమలులో వుందన్నారు. అలాగే 30 పోలీస్‌యాక్ట్ కూడా అమలులో ఉందని తెలియజేశారు. కడప నగరంలో అన్ని రకాల దుకాణాలు రాత్రి 9 గంటలకే మూసివేయాలని తెలిపారు. ట్రబుల్ మాంగర్లు జాగ్రత్తగా వుండాలన్నారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

– స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద డ్రోన్ నో ఫ్లై జోన్ ...

కడప నగర శివార్లలోని మౌలానా అజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్శిటీలోని స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలను భద్రపరిచిన నేపథ్యంలో పరిసర ప్రాంతాల్లో 'డ్రోన్ నో ఫ్లైజోన్'గా ప్రకటిస్తున్నట్లు కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

విద్యార్థులకు పుస్తకాలు, సామగ్రి వితరణ



విద్యా సామగ్రి అందుకున్న విద్యార్థులతో అభిరామ్, మిత్రబృందం

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన ఆర్తీ పాఠశాల విద్యార్థులకు సోమవారం స్థానికంగాగల కొందరు విద్యార్థులు ఉచితంగా యూనిఫాం, పుస్తకాలు, బూట్లు, ఇతర సామగ్రిని అందజేశారు. ఐదేళ్లుగా స్థానిక రాచమడుగు అభిరామ్ తన మిత్ర బృందంతో కలిసి ఏర్పాటు చేసిన చిల్డ్రన్ ఫర్ చిల్డ్రన్ సంస్థ ఆధ్వర్యంలో ఈ వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం విద్యార్థులకు మూడు జతల యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, రెండు జతల బూట్లు, సాక్సులు అందజేశారు. ఆర్తీ పాఠశాల డైరెక్టర్ ఎం.భాగ్యమ్మ పాల్గొన్నారు.

కడపలో అడిషనల్ డీజీ పర్యటన

కడప అర్బన్: రాష్ట్ర అడిషనల్ డిజీగా పనిచేస్తున్న సునీల్‌కుమార్ సోమవారం కడపకు విచ్చేశారు. ఆయన కడపలోని పోలీస్ అతిథిగృహానికి వచ్చి వ్యక్తిగత కార్యక్రమాలను చూసుకున్నారు. మళ్లీ తిరిగి వెళ్లారు. ఆయనను పోలీసు అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేదపండితులు

పెండ్లిమర్రి: మండలంలోని చిన్నదాసరిపల్లె గ్రామ సమీపంలోని వెయ్యినూతలకోన పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీలక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజారోహణం కార్యక్రమాన్ని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.నరసింహ హరిప్రసాద్ ప్రారంభించారు. ముందుగా వేదపండితుల ఆధ్వర్యంలో యాగశాల ప్రవేశం, కలశస్థాపన, ఆరాధన, శాంతి హోమం, సాయంత్రం వేదాది పారాయణాలు, చతుస్థానార్చన వంటి కార్యాక్రమాలు వైభవంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.

ఐటీఐతో ఉపాధి అవకాశాలు

వేంపల్లె : పారిశ్రామిక రంగానికి ఐటీఐ విద్యార్థుల ఆవశ్యకత ఎంతో ఉందని వేంపల్లె కందుల ఓబుల్‌రెడ్డి ఐటిఐ ప్రిన్సిపల్ ప్రసాద్‌రావు అన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థి 10వ తరగతి పూర్తి చేసిన వెంటనే ఐటీఐ విద్యను అభ్యసించితే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. మిగిలిన కోర్సుల కంటే ఐటీఐ అభ్యర్థులకే అవకాశాలు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఐటీఐ చదివిన విద్యార్థులకు ప్రారంభంలోనే రూ.16వేలు జీతంతో పరిశ్రమలు తీసుకొంటున్నట్లు చెప్పారు. ఇతర రంగానికి ఇంతటి అవకాశం లేదన్నారు. మిగిలిన కోర్సులలో డిగ్రీ పూర్తి చేస్తేనే ఉపాధి అవకాశాలు అంతంతమాత్రంగానే ఉన్నట్లు చెప్పారు. ఐటీఐ అభ్యర్థులు పనిచేయడానికి సిద్ధపడితే తిరుపతి, బెంగుళూరు, చెన్నై, శ్రీసిటితో పాటు జిల్లాలో పరిశ్రమలు కూడా అభ్యర్థులను తీసుకొంటున్నట్లు తెలిపారు. ఐటిఐలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. తల్లిదండ్రులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఐటిఐ ప్రాధాన్యతను గుర్తించాలని కోరారు. ఉపాధి అవకాశాల వివరాలకు, అడ్మిషన్ల వివరాలకు ప్రిన్సిపల్‌ను సంప్రదించాలని కోరారు.

అల్లనేరేడు... లాభాలు బోలెడు

పులివెందుల రూరల్ : నిగనిగలాడే అల్లనేరేడు పండ్లంటే అందరికీ ఇష్టమే. రుచిలోనే కాదు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని నిపుణులు అంటున్నారు. కాలానుగుణంగా ప్రకృతి అందించే పండ్లలో అల్లనేరేడు పండు ఒకటి. మే నెలలో ప్రారంభమై జూన్, జూలై వరకు ఈ పండ్లు మార్కెట్‌లో విరివిగా లభిస్తాయి. వాతావరణం మార్పుల కారణంగా వచ్చే ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా ఈ పండ్లు కాపాడుతాయి. అలాగే షుగర్ వ్యాధికి కూడా చాలా ఉపయోగమని నిపుణులు అంటున్నారు. అటవీ ప్రాంతాల్లో నివసించే వారు వీటిని అడవుల నుంచి సేకరించి పట్టణాలకు తెచ్చి విక్రయిస్తుంటారు. అలాగే ఈ చెట్టు గాలి పీల్చడం వల్ల అనేక అనారోగ్య సమస్యలను కూడా దూరం చేసుకోవచ్చు. శరీరంలో వ్యాధినిరోధక శక్తిని పెంచే ఈ పండ్లు ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.300లతో విక్రయిస్తుండడం విశేషం.



వైభవంగా మంచాలమ్మ జాతర



పూజలందుకుంటున్న మంచాలమ్మ అమ్మవారు



రాతిదూలాన్ని ఈడ్చుతున్న ఎద్దు

కమలాపురం: మండల పరిధిలోని టి.చదిపిరాళ్ల–గొళ్లపల్లె గ్రామాల మధ్య వెలసిన పాలేటి గంగమ్మ (మంచాలమ్మ) తిరుణాల మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సోమవారం ఆలయ కమిటీ సభ్యులు, ఆయా గ్రామాల ప్రజల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ముందుగా అమ్మవారికి, మహా గణపతి పూజ, ప్రధాన కలశ స్థాపన, అనంతరం పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఉత్సవాల సందర్భంగా మూడు పూటల అన్నదానం చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవారిని ఆయా గ్రామాల్లోని పుర వీధుల్లో ఊరేగించారు. చెక్కభజన తదితర కార్యక్రమాలు అలరించాయి.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు: తిరుణాల పురస్కరించుకుని ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. వివిధ ప్రాంతాలకు చెందిన 15 కాండ్ల పాల పళ్ల ఎడ్లకు నిర్వహించిన బండలాగుడు పోటీల్లో గెలుపొందిన విజేతలకు వరుసగా, రూ.25,016, రూ.20,016, రూ.15,016, రూ.10,016, రూ.7,016, రూ.5,016, రూ.3,016 నగదు బహుమతులు అందజేశారు.

ఎల్లమ్మ జాతరకు సహకరించాలి

చెన్నూరు : చెన్నూరులో ఈ ఆదివారం జరగనున్న ఎల్లమ్మ జాతర ప్రశాంతతకు అందరూ సహకరించాలని సీఐ పార్థసారథి కోరారు. సోమవారం సాయంత్రం ఆయన చెన్నూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో చెన్నూరు గ్రామంలోని ఇరువర్గాల గ్రామ పెద్దలు, శాంతి కమిటీ సభ్యులుతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ పార్థసారథి మాట్లాడుతూ ఎల్లమ్మ జాతర సందర్భంగా ఊరేగింపులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా చూడాల్సిన బాధ్యత శాంతి కమిటీ సభ్యులపై ఉందన్నారు,. చెన్నూరుపాడిపంటలతో పశువుల సంపదలతో ఎంతో ఆహ్లాదకరంగా ఉండే గ్రామమని, ఇలాంటి తరుణంలో ఎలాంటి సమస్యలకు తావివ్వకుండా ఇందుకు సంబంధించి అందరి సహకారం ఉండాలని వారికి సూచించారు. జాతరలో పర్యవేక్షించడానికి డీఎస్పీతోపాటు సీఐలు, ఎస్ఐలు. పోలీసులు బందోబస్తుగా ఉంటారని తెలియజేశారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు ముదిరెడ్డి సుబ్బారెడ్డి , అన్వర్ బాషా, మునీర్ అహ్మద్, వారిస్, హస్రత్, జుమన్, షబ్బీర్ ఆకుల ప్రసాద్ బాబు. పలువురు శాంతి కమిటీ సభ్యులు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ పార్థసారథి

ఘనంగా బసవేశ్వరుడి జయంతి

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని ఉమామహేశ్వర స్వామి (బసవన్నకట్ట) ఆలయంలో సోమవారం బసవ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వీరశైవ గురుజంగమ లింగాయతి సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం బసవేశ్వరునికి ఆలయ అర్చకులు భీమలింగ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఎడ్లబండిపై బసవేశ్వరుని చిత్రపటాన్ని ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం వెంబడి కోలాటం ఆకట్టుకుంది.

విజ్ఞానం, వినోదం.. వేసవి శిక్షణా శిబిరం

కడప కల్చరల్ : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలు వినోదంతోపాటు విజ్ఞానాన్ని కూడా అందిస్తాయని కడప మండల విద్యాధికారి పాలెం నారాయణ అన్నారు. శిక్షణా శిబిరాల్లో భాగంగా స్థానిక రవీంద్రనగర్‌లోని రామకృష్ణ నగర్ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ఆయన విద్యార్థుల శిక్షణా విధానాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జేవీవీ ఆధ్వర్యంలో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి జరుగుతున్న కృషిని అభినందించారు. శిబిరంలో ఆటపాటలు, సంగీతం, నృత్యం, పేపర్ కటింగ్, కథలు చెప్పడం తదితర అంశాలలో విద్యార్థులకు ప్రవేశం, ప్రావీణ్యం లభిస్తాయన్నారు. ఇలాంటి అవకాశం విద్యార్థులకు మళ్లీ సంవత్సరానికిగాను లభించబోదని, విద్యార్థులు ఇదే మంచి అవకాశమని శిబిరంలో శిక్షణ పొందాలని సూచించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు ఏడీ దేవదత్తం మాట్లాడుతూ ఇప్పటికే రెండు చోట్ల ఈ శిబిరాలు నిర్వహించామని, వీలును బట్టి నగరంలోని మరికొన్నిచోట్ల కూడా నిర్వహించేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వలంటీర్లు విద్యార్థులకు అభ్యుదయ గీతాలను గానం చేయడం నేర్పించారు. మేజిషియన్లు ఇంద్రజాల ప్రదర్శన చేశారు. చిత్రకళ ఉపాధ్యాయులు శ్రీనివాసులు సులభ పద్ధతిలో బొమ్మలు గీయడం నేర్పారు. విద్యార్థులంతా ఎంతో ఉల్లాసంగా, ఆసక్తిదాయకంగా శిబిరంలో పాల్గొన్నారు. సంస్థ జిల్లా అధ్యక్షులు శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి బాలబయన్న, పాఠశాల ప్రతినిధి అబ్దుల్ గఫూర్, సంస్థ ప్రతినిధులు సమీర్‌బాష, వెంకటేశ్వర్లు, డాక్టర్ మామిడి బాబు, సునీత, శివరాం, పి.కిరణ్‌కుమార్, రంగనాయకులు, కామేశ్వరమ్మ, అరుణ, డాక్టర్ చంద్రప్రకాశ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



శిబిరంలో పాల్గొన్న చిన్నారులతో అతిథులు, జేవీవీ ప్రతినిధులు

శంభో శంకర.. శుభంకర

- భక్తుల కొంగు బంగారం అగస్త్యేశ్వరస్వామి
- వైభవంగా బ్రహ్మోత్సవాలు
- నాలుగు గాలిగోపురాలు ఆలయ ప్రత్యేకత

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆలయాలు మన సంస్కృతి, నాగరికతకు నిలయాలుగా భాసిల్లుతున్నాయి. ప్రశాంత వాతావరణానికి దోహదకారి. పట్టణం నడిబొడ్డున వెలసిన శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయం ప్రాచీన దేవాలయాల్లో ఒకటి. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే దేవతలుగా శ్రీఅగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారు ప్రసిద్ధి చెందారు. పూర్వం అగస్త్య మహాముని ఈ ఆలయంలో శివలింగాన్ని ప్రతిష్టించారు. అందువల్ల ఈ శివలింగాన్ని అగస్త్యేశ్వరస్వామిగా పిలుస్తూ భక్తులు ఆరాధ్య దైవంగా కొలుస్తున్నారు. ఈ ఆలయాన్ని 8వ శతాబ్దంలో తెలుగు చోళరాజు నిర్మించారు. 1498లో విజయనగర రాజు ఇమ్మడి నరసింహరాయలు సైనికాధికారి నరసానాయకుడు.. ఈ ఆలయాన్ని అభివృద్ధి చేశారు. 120 అడుగుల పొడవు, 140 అడుగుల వెడల్పుతో ఎత్తయిన ప్రాకారం, నాలుగు దిక్కుల రాజగోపురాలు నిర్మించారు. ఒక్కో రాజగోపురంపై సువర్ణమిశితమైన ఐదు కలశాలను ప్రతిష్టించారు. 1966లో కంచి కామకోటి పీఠాధిపతి చంద్రశేఖరేంద్ర సరస్వతి, 1988లో జయేంద్ర సరస్వతి.. అగస్త్యేశ్వరస్వామిని దర్శించుకుని రాజగోపురంపై బంగారు కలశాల ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవాలను నిర్వహించారు. తూర్పు రాజగోపురంపై పుష్పగిరి పీఠాధిపతి విద్యానృసింహ భారతీస్వామి బంగారు కలశాలను ప్రతిష్టించారు. ఉత్తర, దక్షిణ రాజగోపురాలపై బంగారు కలశాలను కంచి కామకోటి పీఠాధిపతి ప్రతిష్ట, కుంభాభిషేకాలను చేశారు. ఏటా వైశాఖ శుద్ధ సప్తమి నుంచి పది రోజుల పాటు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు.

అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరిదేవి ఆలయం

ఈ ఆలయాలకు ప్రత్యేక గుడి, గర్భగుడి, అంతరాలయాలు ఉన్నాయి. రెండు ఆలయాలను కలుపుతూ ఒకే ముఖ మండపాన్ని నిర్మించారు. మొదటి గర్భగుడిలో మూడు అడుగుల ఎత్తులో అగస్త్యేశ్వరస్వామిని లింగరూపంలో ప్రతిష్టించారు. రససిద్ధికి సంబంధించిన గుంటలు కూడా ఈ శివలింగంపై ఉన్నాయి. అంతరాలయంలో వీరభద్రుడు, కార్తికేయుడు, గణపతి విగ్రహాలు ఉన్నాయి. వీరభద్రుడు సమభంగ స్థానంలో నిలుచుని 8 హస్తాలతో భక్తులకు దర్శనమిస్తున్నారు. కార్తికేయుడు నెమలిపై కూర్చుని 12 హస్తాలతో 6 తలలను కలిగి ఉన్నారు. ఎడమ వైపు గర్భగుడిలో రాజరాజేశ్వరి మాత భక్తులకు దర్శనమిస్తారు.

కోదండ రామస్వామి ఆలయం

ప్రధాన ఆలయానికి ఎడమ వైపున కోదండ రామస్వామి ఆలయాన్ని నిర్మించారు. గర్భగుడిలో సీతారాములు, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి విగ్రహాలు ఉన్నాయి. శ్రీరాముడు అభయ ముద్రలో, సీతాదేవి కమలం చేతపట్టి ప్రసన్నంగా దర్శనమిస్తారు. వినాయకుడు, భీమలింగేశ్వరుడు, పార్వతీదేవి, సుబ్రమణ్యం, శంకరాచార్యులు, అయ్యప్పస్వామి బాలాలయాలున్నాయి. దక్షిణామూర్తి, వీరభద్రుడు, కాలభైరవుడు, చండీశ్వరుడు, గాయత్రీమాత విగ్రహాలను ప్రతిష్టించారు.

'శివతాండవం'కు స్ఫూర్తి

14 భాషల్లో నిష్ణాతులైన శతాధిక గ్రంథకర్త పుట్టపర్తి నారాయణాచార్యులకు ఎనలేని కీర్తి ప్రతిష్టలు తెచ్చిన 'శివతాండవం' కావ్య సృష్టికి మూలం ఈ ఆలయంలోని అగస్త్యేశ్వరుడే. నారాయణాచార్యులు ఆలయంలో కూర్చుని అంతర్గతంగా స్వామి వారిని దర్శిస్తూ అమితానందం పొందేవారట. రోజూ 101 ప్రదక్షిణలు చేసి శివతాండవం కావ్యాన్ని రచించారు. ఆలయ ప్రాంగణంలో పుట్టపర్తి నారాయణాచార్యుల స్మృతికి చిహ్నం ఏర్పాటు చేశారు.



విద్యుత్ దీపాలంకరణలో అగస్త్యేశ్వరస్వామి ఆలయం





అగస్త్యేశ్వరుడి మూలవిరాట్ రాజరాజేశ్వరి మాత

వైభవంగా బ్రహ్మోత్సవాలు

అగస్త్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 14 నుంచి 26 వరకు ఘనంగా నిర్వహిస్తున్నారు. రోజూ అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష పూజాకార్యక్రమాలతోపాటు అలంకరణ, వాహనోత్సవం, సాయంత్రం 6 గంటలకు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 23న రథోత్సవం, 24న వసంతోత్సవం, మధ్యాహ్నం 12 గంటలకు అన్న ప్రసాద వినియోగం, 25న పవళింపుసేవ, 26న శాంత్యుత్సవం జరుగనున్నాయి.